సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీమురళీకృష్ణ ఆలయం నుంచి పల్లకీయాత్ర సాగింది.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉన్నతి శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ఇందులో క్వాలిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓమోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కళ్లకు గంతలతో నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బుధవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకోవడంతో పాటు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు ప్రశాంత్‌రెడ్డి, అరుణ, దేవదర్శన్, ప్రకాశ్, ప్రియాంక, దీప్తి, శ్రీకాంత్, రాజేశ్వర్, రాకేశ్, పార్థసారథి పాల్గొన్నారు.

‘మన ఊరు- మన బడి’ పనులు వేగవంతం చేయాలి

కైలాస్‌నగర్: మన ఊరు, మన బడి కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మన ఊరు- మనబడి కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై సంబంధితాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రహరీలు, మరుగుదొడ్లు, వంటగదులు, అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ వంటి నిర్మాణ పనులపై పాఠశాలల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. మండలానికి రెండు పాఠశాలలను అన్ని వసతులతో మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి నారాయణ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 2,008 దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 2,008 మంది దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను అధికారులకు బుధవారం సమర్పించారు. వీటిని కమిటీ పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కాగా ఫిబ్రవరిలో బదిలీల కోసం 1605 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. కోర్టు కేసు కారణంగా వాయిదాపడిన తర్వాత మరోసారి ప్రభుత్వం దరఖాస్తుకు మంగళవారం వరకు గడువు ఇచ్చింది. ఇది ముగిసిన క్రమంలో మరో 403 మంది అదనంగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే 90 శాతం మంది వరకు ఉపాధ్యాయులు బదిలీ ప్రక్రియలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 2,480 మంది ఉపాధ్యాయులు ఉండగా, 2008 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో దాదాపు 1500 మంది వరకు ఉపాధ్యాయులకు బదిలీలు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

‘వసూల్ రాణి’పై ఆరా..

- స్పందించిన రిమ్స్ డైరెక్టర్
- అక్రమాలపై విచారణకు ఆదేశం
- ఐదుగురితో కమిటీ
- ఉద్యోగుల సెక్షన్ల మార్పు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అక్రమవసూళ్ల దందాపై ‘సాక్షి’లో బుధవారం ప్రచురితమైన ‘మరో వసూల్ రాణి!’ కథనానికి రిమ్స్ అధికారులు స్పందించారు. విచారణకు ఆదేశించారు. స్టాఫ్‌నర్సుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వైనాన్ని వివరిస్తూ ప్రచురితమైన ఈ కథనం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అవినీతిపరుల గుండెల్లో గుబులు రేకెత్తించింది. ఈ కథనానికి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. అక్రమాలపై విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే రిమ్స్ పాలన విభాగంలో ప్రాథమిక చర్యగా ఉద్యోగుల సెక్షన్లను మార్పు చేశారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం


అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులు, సిబ్బంది నుంచి పనుల కోసం డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విచారణ కమిటీ అందించే నివేదిక ఆధారంగా బాధ్యులైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సాక్షి స్పందన

ముగ్గురు ఇన్.. ఇద్దరు ఔట్!

- స్పోర్ట్స్ స్కూల్‌లో అక్రమ డిప్యూటేషన్లపై డీఈవో చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ముగ్గురు ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ‘సాక్షి’లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన డీఈవో నలుగురి అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా వారి స్థానాల్లో కొత్తగా నాలుగు సబ్జెక్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో గణితం బోధించేందుకు జెడ్పీఎస్ఎస్ నార్నూర్ మండలానికి చెందిన బి.కృష్ణ మోహన్‌ను, ఫిజికల్ సైన్స్ బోధించేందుకు జెడ్పీఎస్ఎస్ తలమడుగుకు చెందిన అజయ్‌కుమార్‌ను, ఇంగ్లిష్ బోధించేందుకు జెడ్పీఎస్ఎస్ బేలకు చెందిన ఎ.భూమన్నను నియమించారు. వీరు విద్యా సంవత్సరం వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సోషల్ సబ్జెక్టు బోధించేందుకు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరు ముందుకు రాకపోవడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది.



డీఈవో జారీ చేసిన డిప్యూటేషన్ ఉత్తర్వు ప్రతి

ఇద్దరు కోచ్‌ల డిప్యూటేషన్ రద్దు..



సాక్షిలో ప్రచురితమైన కథనం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాల నిర్వహణ అధ్వానంగా మారిన తీరుపై ‘వివాదాల్లో.. స్పోర్ట్స్’ శీర్షికన ఈనెల 4న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి డీఈవో ప్రణీత స్పందించారు. పూర్తిస్థాయి అర్హతలు లేని శిక్షకులు కొనసాగడంతో అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇందులో ప్రస్తావించింది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన జిల్లాయువజన క్రీడాశిక్షణాధికారి ఎస్.వెంకటేశ్వర్లు డీఈవోకు లేఖరాశారు. తదనుగుణంగా చర్యలు చేపట్టిన డీఈవో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీపీఎస్ తంతోలి ఎస్జీటీ ఆర్.కబీర్‌దాస్, ఉట్నూర్ జెడ్పీఎస్ఎస్ ఉర్దూ మీడియం పీఈటీ ఆర్. జయశ్రీల డిప్యూటేషన్లు రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని సంబంధిత ఏంఈవో, హెచ్ఎంలను ఆదేశించారు.

సిండికేట్ వల!



- వైన్స్‌లను గుప్పిట్లోకి తెచ్చుకునే యత్నాలు
- రూ.అరకోటికి పైగా గుడ్‌విల్‌తో ఎర
- జిల్లాకేంద్రంలో మొదలైన బేరసారాలు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ప్రస్తుతం సిండికేట్ వ్యవహారాలు నడుపుతున్న వ్యాపారులు చక్రం తిప్పుతున్నారు. వారం క్రితం రూ.60 లక్షలు గుడ్‌విల్ రూపేనా ఇచ్చి ఆ లైసెన్స్ హోల్డర్ నుంచి కొనేయడం గమనార్హం. ఆ వైన్స్ కౌంటర్ ప్రతి రోజు సుమారు రూ.4లక్షల వరకు ఉండడంతో అనువుగా ఉంటుందని వారు తమ చేతిలోకి తెచ్చుకున్నారు. ఇదేవిధంగా పట్టణంలోని మరి కొన్ని షాపులను కూడా ఇదే రీతిలో హస్తగతం చేసుకొని ఈసారి సిండికేట్‌లో ఏకచత్రాధిపత్యం సాధించాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు.

బేరసారాలు షురూ..

జిల్లాలో 40 వైన్స్‌లు ఉండగా, ఆదిలాబాద్ పట్టణంలో 10 ఉన్నాయి. 2023 పాలసీలో భాగంగా టౌన్‌లోని పది షాపుల్లో రెండు షాపులు దక్కించుకోవడం ద్వారా మద్యం వ్యాపారంలో ఆరితేరిన కొంత మంది సిండికేట్‌గా గుత్తాధిపత్యం చేయడం ద్వారా ప్రయోజనాలు పొందారు. ఈసారి కూడా ఒకట్రెండు షాపులు టెండర్‌లో దక్కించుకోగా, పట్టణంలోని మిగతా షాపులపై ఫోకస్ పెట్టారు. ఈసారి పలువురు పాత వ్యాపారులకు షాపులు దక్కకపోవడం, ఈ సిండికేట్ వర్గానికి దన్నుగా నిలుస్తుంది. లక్కీడ్రాలో ఈ వ్యాపారంలో కొత్త వారికి షాపులు దక్కాయి. దీంతో వైన్స్‌లను దక్కించుకున్న లైసెన్స్‌దారుడు, ఆ గ్రూప్‌లతో ఈ సిండికేట్ వ్యాపారులు బేరసారాలు షురూ చేశారు.

వారికి లాభం.. మద్యం ప్రియులకు కుచ్చుటోపి..

లిక్కర్ వ్యాపారంలో సిండికేట్ వ్యవహారాన్ని నడపడంలో ఆరితేరిన కొంతమంది ముందు నుంచి తమ గుప్పిట్లో ఉంచుకోవడం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. ఈ సిండికేట్ వల్ల వారికి పెద్ద ఎత్తున లాభం జరుగుతుండగా, మద్యం ప్రియులకు మాత్రం కుచ్చుటోపి పడుతుంది. వైన్సులన్నీ తమ గుప్పిట్లో ఉంటే ఈ సిండికేట్ లిక్కర్ కంపెనీలను మేనేజ్ చేయడం జరుగుతుంది. ప్రధానంగా ఆ బ్రాండ్‌లను విక్రయిస్తామని చెప్పడం ద్వారా ఆ కంపెనీ నుంచి అధికంగా డిస్కౌంట్ పొందుతారు. అంతే కాకుండా షాపులన్నీ తమ పరిధిలో ఉండడంతో ఎమ్మార్పీకి అదనంగా ధర వెచ్చించి విక్రయిస్తారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారులను మామూళ్ల ద్వారా మచ్చిక చేసుకుంటారు. ప్రధానంగా మార్కెట్లో డిమాండ్ లేని చీప్‌లిక్కర్ బ్రాండ్‌లను ఈ సిండికేట్ ద్వారానే పట్టణంలోని బెల్టు షాపులకు విక్రయిస్తారు. వారు ఎమ్మార్పీ మించి విక్రయించినా పెద్దగా ఎవరు పట్టించుకోరు. ఈ విధంగా మద్యం ప్రియుల జేబుకు చిల్లు పడుతుంది. అంతే కాకుండా సాధారణ బ్రాండ్‌ల కారణంగా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వైన్సుల్లో మాత్రం అన్ని సరిగ్గా జరుగుతున్నాయనే రీతిలో వ్యవహారం సాగుతుంది. ప్రధానంగా బెల్టు షాపుల్లోనే చీప్ లిక్కర్ విక్రయాలు అధికంగా జరుగుతాయి. తద్వారా ఈ సిండికేట్ వర్గాలు భారీగా లాభాలు సాధిస్తాయి. దీంతోనే వైన్స్‌లు గుప్పిట్లో తెచ్చుకునేందుకు అరకోటికి పైగా గుడ్‌విల్ ఎర చూపుతున్నారంటే అందులో లాభాలు ఎలా ఉంటాయనేది అవగతం అవుతుంది.

ఎన్నికల నేపథ్యంలో..

రానున్న ఎన్నికల నేపథ్యంలో సిండికేట్ వ్యాపారులు అలర్ట్ అయ్యారు. ఎక్కువ మొత్తంలో షాపులను గుడ్‌విల్ ద్వారా హస్తగతం చేసుకొని ఈ సమయంలో భారీగా లాభాలు పొందాలని దృష్టి పెట్టారు. అంతే కాకుండా టెండర్లు ముగిసిన తర్వాత షాపులు ఏర్పాటుకు ఎక్కువ సమయం ఉండడంతో సిండికేట్ వ్యవహారం కూడా క్రమక్రమంగా అన్ని షాపులను దక్కించుకోవాలే యత్నాలు నడుస్తున్నాయి. ఈ ఎక్సైజ్ టెండర్లలో పలువురు గ్రూపులుగా దరఖాస్తు ఫీజు చెల్లించి లక్కీడ్రాలో పాల్గొన్నారు. దీంతో గుడ్‌విల్ ఆఫర్ ఒక లైసెన్స్‌దారుడే అని కాకుండా ఆ గ్రూప్‌లోని అందరిని మేనేజ్ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో పట్టణంలో ప్రస్తుతం గుడ్‌విల్ ద్వారా దక్కించుకున్న షాపు విషయంలో ఒక రకమైన చర్చ సాగుతుంది. ఈ గ్రూప్‌లోని కొంత మంది రూ.80లక్షలు డిమాండ్ చేయగా, ఆ సిండికేట్ వ్యాపారులు లైసెన్స్ హోల్డర్‌ను మచ్చిక చేసుకొని రూ.60లక్షలు చెల్లించేసి ఆ గ్రూప్‌లోని మిగతా వారికి దెబ్బకొట్టినట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో మిగతా గ్రూప్‌లు అలర్ట్ అయ్యాయి.

చివరి అవకాశం

- ఈనెల 19వరకు ఓటరు నమోదుకు గడువు
- ముగిసిన రెండు విడతల ప్రత్యేక కార్యక్రమం
- జిల్లాలో కొత్తగా 5,485 మంది దరఖాస్తు

నియోజకవర్గాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు

నియోజకవర్గం	ఫారం–6	ఫారం–7	ఫారం–8
ఆదిలాబాద్	2,653	337	689
బోథ్	2,832	60	673



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

కైలాస్‌నగర్: ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన నాలుగు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిసింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆగస్టు 26, 27, ఈ నెల 2, 3వ తేదీల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓటరు నమోదు కోసం 5,485 మంది దరఖాస్తు చేసుకున్నారు. మార్పులు, చేర్పుల కోసం 1,362 మంది దరఖాస్తు చేసుకోగా, తొలగింపు కోసం 397 దరఖాస్తులు అందాయి. ఈ ప్రత్యేక శిబిరాలు ముగిసినప్పటికీ ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనే యువతకు ఇదే చివరి అవకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

19 వరకు నమోదుకు అవకాశం

దరఖాస్తులతో పాటు గత నెల 21న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను ఈనెల 19వరకు స్వీకరించనున్నారు. ఈ అభ్యంతరాలతో పాటు ఓటరు నమోదు, తొలగింపు, సవరణల కోసం అందిన దరఖాస్తులను బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు వాటిని పరిష్కరించనున్నా రు. వాటి ఆధారంగా అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటించనున్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విధులు నిర్వహించేలా వారిని పర్యవేక్షించేందుకు గాను ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల వారీగా సూపర్‌వైజర్లను నియమించారు. మండలాల వారీగా అందిన ఓటరు దరఖాస్తులను ఆపరేటర్లు కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు.

కొత్త ఓటర్లుగా 5,485 మంది నమోదు

ఈ ఏడాది అక్టోబర్ 1నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటరుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు ఈసీ అవకాశం కల్పించింది. దీంతో యువ ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి దరఖాస్తు చేసుకున్నారు. బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా 2,832 మంది దరఖాస్తు చేసుకోగా, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,653 మంది ఉన్నారు. ఈ దరఖాస్తులను బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ నెల 19వరకు వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయనున్నారు. ఆగస్టు 26, 27తేదీల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఓటరుగా నమోదు కోసం 890 దరఖాస్తులు రాగా, సవరణల కోసం 236 దరఖాస్తులు రాగా, తొలగింపుల కోసం 52 దరఖాస్తులు అందాయి.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..



ముగ్గురు పిల్లలతో సునీత

ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నవేగాంకు చెందిన బోయిని మల్లేశ్(35) ఈఏడాది జూలై 4న మేకలు మేపుతుండగా పిడుగుపాటుకు గురై ప్రాణాలు వదిలాడు. తనకున్న పది గొర్రెల ఆధారంగానే భార్య సునీత, ముగ్గురు పిల్లల జీవనం సాగేది. ఇంటి పెద్ద దిక్కు అకాల మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. కుటుంబ బాధ్యతలు మల్లేశ్ తండ్రి సాంబయ్యపై పడింది. సర్కారు నుంచి పైసా పరిహారం అందలేదు.

- 2021, జూలైలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలానికి చెందిన దోత్రే శోభ చేనులో పిడుగుపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తండ్రి గతంలోనే అనారోగ్యంతో చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు దేవిక, డేవిడ్.. అమ్మానాన్నలకు శాశ్వతంగా దూరమయ్యారు. ప్రస్తుతం వారి చిన్నమ్మ వద్ద ఉండి చదువుకుంటున్నారు. సర్కారు నుంచి వీరికి ఎటువంటి పరిహారం అందలేదు.

బడుగులపై పిడుగులు!

- ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత
- ప్రకృతి వైపరీత్యాలతో కుటుంబాలు ఆగం
- పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం
- ఉమ్మడి జిల్లాలోని బాధిత కుటుంబాల్లో తీరని విషాదం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగించే బడుగుల జీవితాలను పిడుగులు ఆగం చేస్తున్నాయి. ఏటా వానాకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వీటిప్రభావంతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 8 మంది పిడుగుపాటుకు బలయ్యారు. మేకలు, గొర్రెలు, పశువులు మృత్యువాతపడి ఆస్తి నష్టం జరిగింది. పిడుగులకు ఎక్కువగా రైతులు, కూలీలు, పశువులు, మేకల, గొర్రెల కాపర్లు బలవుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏ ప్రాంతంలో పిడుగు పడబోతోందో హెచ్చరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చినా పిడుగుపాటు మరణాలు కొనసాగుతుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో అడవులు, నీటి ప్రవాహాలు, ఎత్తయిన కొండలు ఎక్కువగా ఉండ డం, పశువుల కాపర్లు, మత్స్యకారులు, రైతులు, కూలీలు వర్షంలోనే పనులు చేస్తుండడంతో ప్రమాద బారిన పడుతున్నారు.

పరిహారం అందడం లేదు

ప్రకృతి వైపరీత్యాలకు పరిహారం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.6 లక్షలు ఇస్తున్నాయి. అయితే ఈ పరిహారం పొందేందుకు తహసీల్దార్, ఎస్సై, వైద్యాధికారితో కూడిన కమిటీ పిడుగుపాటుతో చనిపోయినట్లు నిర్ధారణ చేయాలి. ఆ తర్వాత బాధిత కుటుంబాలకు రెవెన్యూశాఖ నుంచి పరిహారం అందుతుంది. అయితే రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో బాధిత కుటుంబాలకు ఈ పరిహారం అందడం లేదు. మంచిర్యాల జిల్లాలో 2020 నుంచి 2021 మధ్య ఐదుగురికి రూ.6 లక్షల చొప్పున మంజూరైనా నిధులేమితో బాధిత కుటుంబాలకు అందని పరిస్థితి. ఇక కొన్నిసార్లు పిడుగుపాటుతో మరణించినప్పటికీ అధికారుల లెక్కల్లోకి రాక, బాధితులు పరిహారానికి దూరమవుతున్నారు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

పిడుగుపాటుపై నేటికీ గ్రామీణుల్లో అవగాహన లేమితో మరణాలు జరుగుతున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నప్పుడు చెట్లు, నీటి ప్రవాహాలు, కొండలు, విద్యుత్ సరఫరా స్తంభాలు, ఎత్తయిన తాటి చెట్లకు దూరంగా ఉండాలి. ఒకే చోట ఎక్కువ మంది గుమిగూడడం, పశువులు, జీవాల గుంపుగా ఉండొద్దు. ఉరుములు, మెరుపులు వస్తే, ఇంటికి వెళ్లడం లేదా సమీపంలోనే ఉన్న రక్షిత ప్రాంతానికి తరలాలి. బీపీ, గుండె జబ్బులు, ఫిట్స్ వచ్చే వాళ్లు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు బయట ఉండొద్దు. పిడుగు పడే సమయంలో అరచేతులతో చెవులు మూసుకోవాలి. నేలపై మోకాళ్ల మీద కూర్చొని తలకిందకు వంచాలి. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, బైక్‌లకు దూరంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడొద్దు. గ్రామాల్లో పిడుగులపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

జిల్లాల వారీగా పిడుగుపాటు మరణాలు (గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌వరకు)

ఆదిలాబాద్	01	ఆసిఫాబాద్ 04
మంచిర్యాల	02	నిర్మల్ 01
మొత్తం 08		

వానాకాలం ప్రారంభం నుంచే మరణాలు..

- గత ఏప్రిల్‌లో అకాల వర్షం పడి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురాలో మేకల కాపరి మోహన్ (21), మే నెలలో ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన మధూకర్(21) పిడుగులు పడి చనిపోయారు.
- గత జూన్ 11న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూరుకు చెందిన కడ్తల గురువయ్య(73) ఊళ్లో పోచమ్మ గుడికి వెళ్లి వస్తుండగా పిడుగు పడి చనిపోయాడు.
- బెజ్జూర్ మండలం పోతేపెల్లికి చెందిన తొడసం పోసక్క(20) ఈనెల 2న పిడుగుపాటుకు బలైంది. పోసక్క మంచిర్యాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. ఇటీవల రాఖీ పండుగకు ఇంటికి వచ్చింది. స్నేహితురాలైన భూదక్కతో కలిసి చేనులోకి మిరపనారు వేయడానికి వెళ్లింది. సాయంత్రం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న భూదక్కకు తీవ్ర గాయాలయ్యాయి.
- భీమారం మండల కేంద్రంలోని తెనుగువాడకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బండారి లింగయ్య(68) ఈనెల 2న పిడుగుపాటుతో మృతి చెందాడు. బ్యాంక్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.

లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి



పిడుగు ముప్పు తప్పించుకునేలా ఎత్తయిన భవనాలు, ఇళ్లపై లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇది పిడుగును ఆకర్షించడంతో ముప్పు తప్పించుకోవచ్చు. లైటెనింగ్ కండెక్టర్‌ను కాపర్‌తో తయారు చేసిన త్రిశూలాన్ని ఎత్తయిన కట్టడాల మీద ఏర్పాటు చేస్తారు. ఈ కాపర్ వైర్‌ను భూమికి కలుపుతారు. హై ఓల్టేజ్ ప్రవాహం భూమిలోకి వెళ్లి పోతుంది.

– ఎం.కిశోర్‌కుమార్, భౌతికశాస్త్రం, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

దివ్యాంగులు ఇంటి వద్దే ఓటేసేలా చర్యలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రానున్న ఎన్నికల్లో దివ్యాంగులంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం వీల్‌చైర్, ర్యాంపు వంటి వసతులు కల్పిస్తున్నామన్నారు. కేంద్రానికి రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటువేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు మాత్రమే ఓటేసేందుకు అర్హులని చెప్పారు. voters. eci. gov. in వెబ్‌సైట్ ద్వారా ఓటరు జాబితాలో తమ వివరాలు చూసుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 19లోగా ఓటరుగా నమోదుకు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 4న తుదిఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదుకు సహకరించాలని కోరారు. అనంతరం బూత్‌స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలో ఆగస్టు 26, 27 సెప్టెంబర్ 2, 3తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వెంటనే పూర్తీ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీడబ్ల్యూవో మిల్కా, ఆర్డీవో స్రవంతి, రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంటాలను సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవోలు


సందర్శనకు వచ్చిన ట్రైనీ ఎఫ్‌బీవోలు

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతాన్ని దూలపల్లి ట్రైనీ ఎఫ్‌బీవోలు బుధవారం సందర్శించారు. 33వ బ్యాచ్‌కు చెందిన వీరు జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందారు. ఈ సందర్భంగా సిరిచెల్మ రేంజ్‌ అధికారి గణేష్‌ జలపాతం విశిష్టతలను వివరించారు. ఇందులో కుంటాల సెక్షన్‌ అధికారి వసంత్‌ కుమార్‌, బీట్‌ అధికారి సచిన్‌, భీమ్జి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్‌: హైదరాబాద్‌లోని దులపల్లి ఫారెస్టు అకాడమికి చెందిన ఫారెస్టు బీట్‌ ఆఫీసర్‌లు (ఎఫ్‌బీవో) శిక్షణలో భాగంగా బుధవారం మావల శివారు ప్రాంతంలోని హరిత వనం పార్కును సందర్శించారు. పార్కు అభివృద్ధి, జంతువులపై, పక్షుల గురించి ఎఫ్‌ఆర్వో గులాబ్‌సింగ్‌ అవగాహన కల్పించారు. ఆయన వెంట డీఆర్‌వో గీత, ఎఫ్‌బీవో ప్రశాంత్‌, తదితరులున్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఈనెల 22న చోరీ జరిగింది. టూటౌన్‌ ఎస్సై జివి రమణారెడ్డి వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన పి.మల్లయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య స్పిన్నింగ్‌ మిల్లులో పనిచేస్తోంది. ఇంట్లోని తన పర్సులో రూ.20వేల నగదుతో పాటు 9 గ్రాముల బంగారం ఉంచి ప్రతి రోజులాగే ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న సమయంలో తలుపులు తెరిచి ఉండటం, పర్సు అక్కడ లేక పోవడంతో ఖంగుతింది. చోరీ జరిగిన విషయాన్ని చుట్టుపక్కల వారిని విషయాన్ని అడిగి తెలుసుకుంది. బుధవారం టూటౌన్‌ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రైనీ ఐఏఎస్‌ పర్యటన

బోథ్‌: మండలంలోని ధన్నూర్‌ బి, రఘునాథ్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో శిక్షణ ఐఏఎస్‌ వికాస్‌ మహతో బుధవారం పర్యటించారు. శిక్షణలో భాగంగా గ్రామాల్లో అమలవుతున్న వివిధ పథకాల అమలును పరిశీలించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు వివిధ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పంటల నమోదును పరిశీలించారు. తహసీల్దార్‌ కార్యాలయంలో పహణీలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ దశరథ్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ పుష్పలత, స్వామి ఉన్నారు.

ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఖానాపూర్‌ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్‌ 68లోని భూమి తనకు సంబంధించినదని చెప్పి బుధవారం అందులో ప్రవేశించిన ఆదిలాబాద్‌ పట్టణంలోని బృందావని కాలనీకి చెందిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిత్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... సర్వే నంబర్‌ 68లో పలువురు ఇండ్లు నిర్మాణం చేసుకోగా ఈ భూమి తనదేనని చెప్పి శ్రీనివాస్‌ అందులో ప్రవేశించారు. అయితే ఆ ప్రాంతంలో ఇండ్లు నిర్మాణం చేసినా జయశ్రీతో పలువురు ఇచ్చినా ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం సంబంధిత తహసీల్దార్‌కు రాయడం జరిగిందని తెలిపారు.

SBI స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా
ఆదిలాబాద్‌ టౌన్‌ బ్రాంచి (11987), ఆదిలాబాద్‌-504001.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ యొక్క హైపోథికేషన్‌ అగ్రిమెంట్‌ ఆక్షన్‌ క్రింద)
రుణగ్రహీత పేరు: మెస్సర్స్‌ ఎఆర్‌కె లాజిస్టిక్స్‌, యజమాని: శ్రీ అత్రం రోషన్‌ కుమార్‌
ఇంటి నెం. 11-262, బిబి చౌక్‌, ఉట్నూరు, ఆదిలాబాద్‌ జిల్లా.
అకౌంట్‌ నెం. 39923746361- (TL) 401638964292 - GECL

వ.నెం.	వాహనముల యొక్క వివరములు	రిజర్వుధర & EMD
1	TRUCK NO.TS 01 UC - 5345- TATA MOTERS LPT 35215L 550WB TRUK BS V1 MODEL 2021, ENG NO.5LNGDICR19AYX100612, CHASSIS NO.MAT799009M1B03496.	రూ.13,25,000/- & EMD రూ.1,32,500/-
2	TRUCK NO.TS 01 UC - 4578- TATA MOTERS LPT 35215L 550WB TRUK BS V1 MODEL 2021 ENG NO.5LNGDICR19AYX100531, CHASSIS NO.MAT799003M1A02806	రూ.13,25,000/- & EMD రూ.1,32,500/-
3	TRUCK NO.TS 01 UC - 4337- TATA MOTERS LPT 35215L 550WB TRUK BS V1 MODEL 2020 ENG NO.5LNGDICR19NZX104042, CHASSIS NO.MAT799003L1P10315	రూ.12,50,000/- & EMD రూ.1,25,000/-

ఇ-వేలం నియమనిబంధనలు
1. ఇ-వేలం ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ ఆ విధంగానే పద్ధతిన నిర్వహించబడుతుంది. అండ్‌ ఆన్‌లైన్‌ ద్వారా నిర్వహించబడుతుంది. వేలం బ్యాంక్‌ ఆమోదిత సర్వీస్‌ ప్రొవైడర్‌ M/s.C1 ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ ద్వారా వెబ్‌పోర్టల్‌ https://www.bankeauctions.com ద్వారా నిర్వహించబడుతుంది. ఆన్‌లైన్‌ ఇ-వేలం బిడ్‌ ఫామ్‌ (అనెగ్జర్‌-2, అనెగ్జర్‌-3), డిక్లరేషన్‌, ఆన్‌లైన్‌ వేలం అమ్మకం సాధారణ నియమ నిబంధనలు కలిగిన ఇ-వేలం టెండర్‌ డాక్యుమెంట్‌ https://www.bankeauctions.com లో లభించును.
2. వర్తించే RC బదిలీ ఛార్జీలు, రుసుము మొదలైనవాటిని మరియు చట్టబద్ధమైన, చట్టబద్ధత లేని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్‌, రుసుములు మొదలైనవాటిని కొనుగోలుదారుడే భరించాలి.
3. ఏ దశలోనూ ఎటువంటి కారణం చెప్పకుండానే అధీకృత అధికారి/బ్యాంక్‌ అత్యున్నత ఆఫర్‌ను అంగీకరించడానికి కట్టుబడి ఉండరు మరియు ఏదైనా లేదా అన్ని ఆఫర్‌(ల)ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఇ-వేలాన్ని వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి లేదా వేలం ప్రక్రియ నుండి ఏదైనా ఆస్తి లేదా భాగాన్ని ఉపసంహరించుకోవడానికి సంపూర్ణ హక్కును కలిగి ఉంటారు.
4. EMD లేకుండా సమర్పించిన బిడ్‌లు తిరస్కరించబడును. ఆస్తిని రిజర్వ్‌ ధర కంటే తక్కువకు విక్రయించబడదు. షరతులతో కూడిన బిడ్‌లు చెల్లనివిగా పరిగణించబడతాయి. బిడ్‌/ల సమర్పణ తర్వాత బిడ్‌లో ఎలాంటి మార్పుకు సంబంధించి ఎలాంటి కరస్పాండెన్స్‌ ఉండదని దయచేసి గమనించండి.
5. వాహనాలను తేది.14-09-2023న మ. 12.00 గం॥ల నుండి మ. 01.00 గం॥ల వరకు ఆన్‌లైన్‌లో వేలం వేయబడును. బిడ్‌ సమర్పించుటకు చివరి తేదీ.13-09-2023 సా.4.00 గం॥ల వరకు. వివరాలకు సంప్రదించండి: బ్రాంచి మేనేజర్‌, ఫోన్‌: 9098190260, మరియు M/s. మిత్ర సొల్యూషన్స్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏజెన్సీ) Y.రాములు ఫోన్‌: 9502960779, 7981568729

గమనిక: ఒకవేళ పైన పేర్కొనబడిన ఇ-వేలం తేదీనాటికి బకాయిలు చెల్లించకపోతే, ఋణాల యొక్క ఋణగ్రహీతకు / హామీదారులకు ఇది ఇ-వేలం యొక్క అమ్మకం గురించి నోటీసుగా గమనించగలరు.

తేది.06-09-2023, ప్రదేశం: ఆదిలాబాద్‌ సం/- అధీకృత అధికారి, స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా

సౌండ్‌ మారిందా.. సైలెన్సర్‌ గోవిందా..!

- మార్కెట్‌ల్లో విరివిగా లభ్యం
- అధిక శబ్దాలతో వాహనదారులకు, వృద్ధులపై ప్రభావం
- 126 సైలెన్సర్ల తొలగింపు.. జరిమానా


పట్టణంలోని శివాజీ చౌక్‌లో రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న డీఎస్పీ(ఫైల్‌)


పట్టుకున్న సైలెన్సర్లతో ట్రాఫిక్‌ పోలీసులు (ఫైల్‌)



మార్కెట్లో దొరికే అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్‌

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ జిల్లా కేంద్రంలో ఇటీవల అధిక శబ్దాలతో వెళ్లే వాహనాల సంఖ్య పెరిగింది. దీంతో వాహనదారులతో పాటు వృద్ధులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే శబ్దకాలుష్యంతో అవస్థలు పడుతున్నామని పలువురు పోలీస్టేషన్‌ మెట్లెక్కారు. దీంతో ఇటీవల పట్టణ పోలీసులు అలాంటి సైలెన్సర్లు అమర్చి వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కొరడా ఝులిపిస్తున్నారు.

కంపెనీ అమర్చిన సైలెన్సర్లు మార్చుతూ...
ద్విచక్ర వాహనానికి కంపెనీ అమర్చిన సైలెన్సర్లు మాడిపై చేస్తున్నారా..? అయితే మీకు షాక్‌ ఇచ్చేందుకు పట్టణ పోలీసులు సిద్ధమయ్యారు. శబ్ద కాలుష్యంపై ప్రత్యేక దృష్టిసారించిన పోలీసులు అధిక శబ్దాలు చేసే వారి వాహనాల పని పడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి వారి వాహనాలు సీజ్‌ చేస్తున్నారు.

రోడ్డు రోలర్‌తో తొక్కిస్తూ..
అధిక సౌండ్‌ చేసే బైక్‌లను పట్టుకుని వాటి సైలెన్సర్లను తొలగించి పట్టణ నడి ఒడ్డున గల చౌరస్తాలో రోడ్‌రోలర్‌తో వాటిని పోలీసులు తొక్కించి నుజ్జునుజ్జు చేయిస్తున్నారు. 2023లో ఇప్పటివరకు 126 సైలెన్సర్లను తొలగించారు. ఇందులో నుంచి 100 ద్విచక్ర వాహనాలకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మిగతా 26 ద్విచక్ర వాహనాలను ఆర్టీవోకు అప్పజెప్పారు. దీంతో ఆర్టీవో ఒక్కొక్క వాహనానికి రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. కొన్ని ద్విచక్ర వాహనాలకు పలువురు నేటికీ అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్లు పెట్టుకొని తిరుగుతున్నారు.

శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు..
ఖరీదైన ద్విచక్ర వాహనాలు నడిపేవారు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడుతున్నారని నిర్మల్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సైలెన్సర్లు వాడడంతో శబ్ద కాలుష్యంతో పాటు, వృద్ధుల ఆరోగ్యంపై ఎఫెక్ట్‌ పడనుంది. అంతేకాకుండా రోడ్డుపై వెళ్లే మిగతా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరుతున్నారు.

విక్రయదారులపై చర్యలు శూన్యం..
మార్కెట్లో విచ్చలవిడిగా మెకానిక్‌ షాపుల్లో అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్లు విక్రయిస్తున్నారు. మొదటగా సైలెన్సర్లు విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను వేడుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుంటే అమ్మడం ఆపేస్తారని సూచిస్తున్నారు. పోలీసులు వారిని కట్టడి చేస్తే ఎవరు అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్లు అమర్చుకోలేరని వాపోతున్నారు.

మెకానిక్‌ షాప్‌లకు నోటీసులు



అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్లను అమర్చే మెకానిక్‌ షాప్‌లకు నోటీసులు పంపిస్తాం. అయినా వినకుంటే కేసులు నమోదు చేస్తాం. అధిక సౌండ్‌ వచ్చే సైలెన్సర్లను అమర్చుకునే ద్విచక్ర వాహనదారులకు మొదటిసారిగా జరిమానా విధించి తర్వాత కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతాం. శబ్ద కాలుష్యం ద్వారా జరిగే అనర్థాలకు ఎవరు కారణం కావద్దు. లేదంటే తగిన చర్యలు తీసుకుంటాం.
– గంగారెడ్డి, నిర్మల్‌ డీఎస్పీ

సౌండ్‌తో ఇబ్బంది అవుతుంది



సౌండ్‌ వచ్చే ద్విచక్ర వాహనాలతో పట్టణంలో చాలా ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది. మైనర్లు సైతం ద్విచక్ర వాహనాలకు సౌండ్‌ వచ్చే సైలెన్సర్లు బిగించి రోడ్డు మీద వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలతో రోడ్లపై ఇష్టానుసారంగా నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై పోలీసులు సీరియస్‌గా వ్యవహరించాలి.
– శంకర్‌ యాదవ్‌, మంజులాపూర్‌

శ్రమదోపిడీ చేస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలి

- డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గణేశ్‌ మహారాజ్‌


మాట్లాడుతున్న గణేష్‌ మహారాజ్‌

కైలాస్‌నగర్‌: కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగాల పేరిట శ్రమ దోపిడీకి పాల్పడుతున్న ప్రభుత్వాలను గద్దెదించాలని ధర్మ సమాజ్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్‌ మహారాజ్‌ అన్నారు. కలెక్టరేట్‌ ఎదుట సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్‌ ఉద్యోగుల సమ్మె శిబిరాలను బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు నియామకాల పేరిట కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్‌ నియామకాలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌ వ్యవస్థనే ఉండదన్న ముఖ్యమంత్రి ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కి పోరాడుతున్న వారిని విస్మరించడం సిగ్గు చేటన్నారు. సమగ్ర శిక్షా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు మంజూష, బర్కుంటి రాజీవ్‌, కరాడి గంగన్న, గొంటి ముక్కుల ఓమన్న, తోంటికూరు సంతోష్‌, బండారి సంతోష్‌ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో నిఘా..

- ఆదిలాబాద్‌ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం


హాజరైన ఉమ్మడి జిల్లా డీఎస్పీలు, సీఐ,ఎస్సైలు



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్‌: రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సరిహద్దుల్లో నిఘా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్‌ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉట్నూర్‌ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆదిలాబాద్‌ జిల్లా ఎస్పీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కుమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లా ఎస్పీ కె. సురేశ్‌కుమార్‌, నిర్మల్‌ అదనపు ఎస్పీ వీరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్‌ జిల్లాతో సరిహద్దు కలిగిన పోలీస్‌స్టేషన్‌ అధికారులు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల పోలీస్‌ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాకు అక్రమ మార్గాల్లో అనుమతి లేని వాటిని అరికట్టే విషయంలో అంతర జిల్లా, రాష్ట్ర చెక్‌ పోస్టులు ఉపయోగపడతాయని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని మారుమూల గ్రామాలను నిరంతరం అధికారులు సందర్శిస్తూ మావోయిస్టుల ప్రాబల్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్‌ డీఎస్పీ సీహెచ్‌ నాగేందర్‌, ఆదిలాబాద్‌ డీఎస్పీ వి.ఉమేందర్‌, ఆదిలాబాద్‌ డీసీఆర్బీ అండ్‌ ఎలక్షన్‌ సెల్‌ డీఎస్పీ సీహెచ్‌ శ్రీనివాస్‌, నిర్మల్‌ డీఎస్పీ ఏ.గంగారెడ్డి, ఆసిఫాబాద్‌ డీఎస్పీ కే.శ్రీనివాస్‌, కాగజ్‌నగర్‌ డీఎస్పీ ఏ.కరుణాకర్‌, నిర్మల్‌, ఆసిఫాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాలకు సరిహద్దు సర్కిల్‌ ఎస్సైలు, సీఐలు పాల్గొన్నారు.

గతేడాది కుమారుడికి.. ఈఏడాది తండ్రికి



ఉత్తమ అవార్డు అందుకుంటున్న తండ్రి రాములు


గతేడాది అవార్డు అందుకున్న కుమారుడు శివకృష్ణ

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తండ్రి, కొడుకులు

ఖానాపూర్‌: మండలంలోని మస్కాపూర్‌ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిలుకూరి రాములు సుర్జాపూర్‌ పంచాయతీ పరిధిలోని బుడగజంగంవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ విద్యా సంవత్సరం ఉత్తమ బోధన చేసిన పలువురు ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎంపిక చేయగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రాములు మంగళవారం జిల్లా కేంద్రంలో మంత్రి ఐకే రెడ్డి, కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గతేడాది రాములు కుమారుడు శివకృష్ణ సైతం పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం మోడల్‌ స్కూల్‌లో పీజీటీగా శివకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి, కొడుకులు అవార్డులు అందుకోవడంపై పలువురు అభినందిస్తున్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్‌: ఆదిలాబాద్‌ నుంచి నిర్మల్‌ మీదుగా హైదరాబాద్‌ వరకు కేంద్ర ప్రభుత్వమే రైల్వేలైన్‌ నిర్మించడానికి ముందుకువచ్చిందని బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం జేశాయి. ఈమేరకు కృతజ్ఞతలు చెబుతూ బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్‌, గాంధీచౌక్‌, బుధవార్‌పేట్‌, నగరేశ్వర్‌వాడ, ఈద్గాం తదితర ప్రధాన కూడళ్లలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మల్‌ ప్రజల కలను మోదీ సర్కారు నెరవేర్చనుందన్నారు. సగం వాటా ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కేంద్రమే ఆదిలాబాద్‌ నుంచి నిర్మల్‌ మీదుగా ఆర్మూర్‌, బాన్సువాడ, సంగారెడ్డి, పటాన్‌చెరు వరకు రైల్వేలైన్‌ నిర్మించనున్నట్లు వివరించారు. ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూరావు విన్నవించగా కేంద్రప్రభుత్వం వందశాతం పూర్తి నిధులతో రైల్వేలైన్‌ కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంట్‌ కన్వీనర్‌ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్‌, ఇన్‌చార్జి విలాస్‌ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న రష్మీఠాగూర్‌


ఆలయంలో పూజలు చేస్తున్న రష్మీఠాగూర్‌

భైంసా: మాజీ మిస్‌ ఇండియా, తెలంగాణ ఐటీ హబ్‌ బ్రాండ్‌ అంబాసిడర్‌ రష్మీ ఠాగూర్‌ బుధవారం కుటుంబసమేతంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేసి, అమ్మవారి శేష వస్త్రంతో ఆశీర్వచనాలు అందజేశారు.

గడ్డిక్షేత్రాల పెంపకంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మురత్కర్‌

జన్నారం: అడవిలో వన్యప్రాణులకు సరైన ఆహారం అందించే గడ్డి క్షేత్రాల పెంపకంపై బుధవారం మహారాష్ట్రకు చెందిన గడ్డి క్షేత్రాల నిపుణుడు జీడి మురత్కర్‌ అధికారులకు అవగాహన కల్పించారు. కవ్వాల్‌ టైగర్‌జోన్‌ జన్నారం అటవీ డివిజన్‌ కేంద్రంలోని టీడీసీలో నిర్వహించిన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్‌, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి అటవీ సర్కిళ్ల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులు, పర్యావరణ పరిస్థితులు బాగున్న చోటే వన్యప్రాణులు నివాసం ఉంటాయన్నారు. వన్యప్రాణులు అధికంగా ఉన్న చోట పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందన్నారు. అనంతరం జన్నారం అటవీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్‌ లోకేశ్‌ జైశ్వాల్‌, ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్‌ ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎఫ్‌డీవో శివ్‌ఆశిష్‌ సింగ్‌, ఎఫ్‌డీవో మాధవరావు, వివిధ సర్కిళ్లకు చెందిన 34 మంది ఎఫ్‌డీవోలు, 79 మంది ఎఫ్‌ఎస్‌వోలు, బీట్‌ అధికారులు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి.. ఘరానా మోసం

- రెండు తులాల బంగారు గొలుసుతో ఉడాయించిన అపరిచితుడు
- బ్యాంకులో మరింత లోన్‌ ఇప్పిస్తానని మోసం


మోసపోయిన దంపతులు

లోకేశ్వరం: ఘరానా మోసగాడు దంపతులకు మాయమాటలు చెప్పి బంగారు గొలుసు కాజేసిన సంఘటన మండలంలోని కన్కపూర్‌ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపు నాగన్న అనే రైతు ఇంటికి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పల్సర్‌ బైక్‌పై వచ్చాడు. నాగన్న-లక్ష్మి దంపతులతో నేను బ్యాంకు నుంచి వచ్చాను. మీరు ఇంతకు ముందు బ్యాంకులో గోల్డ్‌ లోన్‌ తీసుకున్నారుగా, మీకు లోన్‌ మాఫీ వచ్చిందని, మరింతగా రెట్టింపు లోన్‌ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. నమ్మిన ఆ దంపతులు లక్ష్మి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును భర్త నాగన్నకు ఇచ్చింది. నాగన్నను అతడి బైక్‌పై ఎక్కించుకుని అబ్దుల్లాపూర్‌ గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్‌ వరకు తీసుకెళ్లి అతడి వద్ద నుంచి గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్‌ గ్రామపంచాయ తీ పరిధిలోని లింగూడ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. లింగూడ గ్రామ సమీపంలోని వాగు పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమీప రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్సై డి.సునిల్‌ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడి ఒంటిపై పసుపు రంగు చొక్కా, గోదుమరంగు పాయింట్‌ ధరించి ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌ ప్రమాదాలు నివారిద్దాం

నిర్మల్‌: భారీ వర్షాల నేపథ్యంలో టీఎస్‌ ఎన్‌పీడీసీఎల్‌ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు రైతులు, విద్యుత్‌ వినియోగదారులకు పలు భద్రతా సూచనలు చేశారని, వాటిని పాటిస్తూ విద్యుత్‌ ప్రమాదాలు నివారిద్దామని ఎస్‌ఈ జేఆర్‌ చౌహాన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో విద్యుత్‌ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దన్నారు. బట్టలు ఆరవేసే దండేలకు విద్యుత్‌ వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో పరిసరాల్లో అతుకుల వైర్లు ఉంటే ఎలక్ట్రీషియన్‌తో సరిచేయించాలని చెప్పారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి వెళ్లవద్దని, స్టార్టర్‌ డబ్బాలను నీటిలో తడవకుండా చూడాలని సూచించారు. ఆరుబయట విద్యుత్‌ స్తంభాలను తాకవద్దని హెచ్చరించారు. విద్యుత్‌ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 0028 లేదా 1912కు ఫోన్‌ చేసి చెప్పాలని ఎస్‌ఈ సూచించారు.

శతాధిక వృద్ధురాలు మృతి


లక్ష్మీబాయి(ఫైల్‌)

నిర్మల్‌ రూరల్‌: మండలంలోని వెంగ్వాపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు తోడిషెట్టి లక్ష్మి బాయి (102) బుధవారం మృతి చెందింది. గ్రామంలోని అత్యధిక వయస్సు ఉన్న మహిళ లక్ష్మిబాయి కావడం గమనార్హం. ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్న ఈమె కుటుంబంలో మొత్తం 45మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈమె కుమారులు అందరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. మనవడు తోడిషెట్టి పరమేశ్వర్‌ జిల్లా విద్యాశాఖలో నోడల్‌ అధికారిగా, మునిమనవడు ప్రణయ్‌ అటవీశాఖలో రేంజ్‌ అధికారిగా, మునిమనవరాళ్లు హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్‌ ఆసుపత్రిలో డాక్టర్లుగా పనిచేస్తున్నారు. లక్ష్మిబాయి మృతిపై వెంగ్వాపేట గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

దాడి ఘటనలో ఒకరికి జైలు

భైంసాటౌన్‌: దాడి చేసిన ఘటనలో ఒకరికి సాధారణ జైలుశిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు తీర్పు ఇచ్చారు. 2017లో భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన గోనె రాందాస్‌ కోతుల్‌గాంకు చెందిన ఏనుగు గంగారెడ్డిపై వ్యక్తిగత కక్షలతో దాడిచేయగా, బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై భైంసా కోర్టు ఏపీపీ అరుణ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు రావడంతో జడ్జి నిందితుడికి మూడునెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

పనుల పరిశీలన

కడెం: మండలంలోని కోలాంగూడలో చిక్కి యూనిట్‌, ఇప్ప పరక నూనె యూనిట్‌ పనులను కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్‌ రాజేశ్వరి, ఏపీడీ గోవిందరావు, ఏపీఎం రాజారాం, సిబ్బంది ఉన్నారు.

ఆటో బోల్తా యువకుడి మృతి


అనిల్‌(ఫైల్‌)

బోథ్‌: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన మద్దెల అనిల్‌(22) ఆటో బోల్తా పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పొచ్చెర గ్రామానికి చెందిన అనిల్‌ నెలరోజుల క్రితం ఆటో ఢీకొన్నాడు. ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం ఆటో స్టార్ట్‌ కాకపోవడంతో బోథ్‌లోని ఓ మెకానిక్‌కు ఫోన్‌ చేశాడు. బోథ్‌ నుంచి మెకానిక్‌ పొచ్చెర గ్రామానికి ఆటోతో వెళ్లాడు. పొచ్చెర నుంచి మెకానిక్‌ ఆటోకు అనిల్‌ ఆటోను తాడుతో కట్టి బోథ్‌కు తీసుకెళ్తున్నారు. ముందరి ఆటోలో మెకానిక్‌ ఆటో నడుపుతుండగా వెనకాల ఆటోను అనిల్‌ డ్రైవింగ్‌ చేస్తున్నాడు. అనిల్‌ నడుపుతున్న ఆటోకు ముందరి టైరుకు చుట్టుకోవడంతో ఆటో పల్టీకొట్టి బోల్తాపడగా అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మొసలి పట్టివేత


పట్టుబడిన మొసలి

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్‌ చెరువులో మొసలి కనపడడంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు చేరుకుని చాకచక్యంగా మొసలిని పట్టుకుని తాళ్లతో బంధించి కడెం ప్రాజెక్ట్‌లో వదిలిపెట్టారు. ఇందులో ఎఫ్‌ఆర్వో అనిత, ఎఫ్‌బీవో రవి ఉన్నారు.

ఎక్సైజ్‌ అధికారులపై ఫిర్యాదు

నిర్మల్‌: తనపై దాడి గతనెల 23న దాడిచేశారంటూ నిర్మల్‌ రూరల్‌ మండలం నీలాయిపేటకు చెందిన కొండా మురళిగౌడ్‌, తమ గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు టీఎఫ్‌టీ లైసెన్సులను ఇచ్చారంటూ కుంటాల మండలం అందకూర్‌కు చెందిన సుంకరి శ్రీశైలంగౌడ్‌లు ఎక్సైజ్‌ అధికారులపై ఆ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌తో పాటు నిర్మల్‌ సీఐపైనా ఫిర్యాదు చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోవడంతో తమకు న్యాయం చేయాలని మంత్రి, హెచ్‌ఆర్‌సీని వారు కోరినట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED
■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్‌ : 9640468899, 9640258899 [H-189329]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462